రంజాన్ వేళలు
ఇఫ్తార్: సోమవారం సాయంత్రం: 6.35 గం.
సహర్: మంగళవారం ఉదయం: 4.48 గం.

గంజాయి మత్తు.. యువత చిత్తు



సిద్దిపేట జిల్లాలో గంజాయి విక్రయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. యువతే టార్గెట్‌గా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. సిగరెట్లలో గంజాయి పొడర్‌ను నింపి విక్రయిస్తూ.. యువకులను, విద్యార్థులను మత్తులో ముంచుతున్నారు. పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు. దీంతో యువత తల్లితండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- నిత్యం వెలుగుచూస్తున్న సంఘటనలు
- నియంత్రిస్తున్నా నిషా వైపే అడుగులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 31: జిల్లాలో గడిచిన నెల రోజుల్లో గంజాయి ప్రియులు, విక్రేతలు పట్టుబడడం జిల్లాలో నిత్యకృత్యంగా మారింది. గ్రామాల్లో మొదలైన వ్యాపారం నేడు కిలోల కొద్దీ విక్రయించే స్థాయికి చేరిందంటే అతిశయోక్తి కాదు. చేర్యాలలో గంజాయి చాక్లెట్లు వెలుగులోకి వచ్చిన నాటి నుంచి ఏదో ఒక చోట ఈ మత్తు పదార్థ బానిసలు పోలీసులకు చిక్కుతూనే ఉన్నారు.

యువకులే గంజాయి ప్రియులు

జిల్లాలో యువకులే ఎక్కువగా గంజాయి ప్రియులు. గత నెల 23వ తేదీన గంజాయి విక్రయించడానికి సిద్దిపేటకు వస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద 4కిలోల పైనే గంజాయి పట్టుబడింది. ఈ ముగ్గురు కూడా 22 ఏళ్ల లోపు యువకులే కావడం గమనార్హం. కేఫ్‌లతో పాటు కాలేజీలు, హాస్టల్‌లు, ఇతర అడ్డాలను టార్గెట్‌గా చేసుకొని గంజాయి విక్రయిస్తుంటారు. అంతేగాకుండా బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు సిద్దిపేటకు వలస వచ్చారు. ఇలాంటి వారిని గంజాయి మత్తులో దించుతున్నారు. ఈ కార్మికుల్లో 90శాతానికి పైగా యువకులే ఉన్నారు. సిగరెట్లలో గంజాయి పొడర్‌ను నింపుకొని సేవించడం వీరికి అలవాటుగా మారింది. అదే విధంగా సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులను సైతం ఈ మహమ్మారి మత్తులో దింపడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వినిపిస్తున్నది.



చేర్యాలలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు (ఫైల్)

పది గ్రాముల గంజాయి ప్యాకెట్లు

హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సిద్దిపేట జిల్లా సమీపంలోనే ఉండడంతో గంజాయి రవాణా యథేచ్ఛగా సాగుతున్నది. ప్రస్తుతం పట్టుబడిన గంజాయి ముఠాల్లో ఎక్కువ శాతం హైదరాబాద్ గంజాయి గ్యాంగులతో సంబంధాలు ఉన్నవారేనని స్పష్టమవుతున్నది. అంతేగాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి ఇక్కడకు తరలిస్తున్న సంఘటనలు సైతం వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, చేర్యాల, ములుగు, వర్గల్, రాయపోల్, నారాయణరావుపేట, బెజ్జంకి, కొండపాక, మద్దూరు, ధూళిమిట్ట, అక్కన్నపేట మండలాల్లో ఈ గంజాయి దందాలు బయటపడ్డాయి. ఒకప్పుడు 20 గ్రాముల గంజాయి పట్టుబడటమే అరుదుగా జరిగేవి. కానీ నేడు కిలోల కొద్దీ గంజాయి పట్టుబడుతున్నది. ఇప్పటి దాకా అరెస్టయిన వారి వద్ద కూడా 100 గ్రాములకు మించే ప్యాకెట్లలో గంజాయి లభ్యమైంది.

పట్టుబడిన సంఘటనలు

- నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి శివారులో ఐదుగురు గంజాయి మత్తులో తూగడమే కాకుండా మిగిలినదానిని ఇంకొందరికి విక్రయించడానికి సిద్ధమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వారిని పట్టుకున్నారు. ఇందులో మైనర్ బాలుడు కూడా ఉన్నాడు.
- భద్రాచలం నుంచి కిలో గంజాయిని కొని ప్యాకెట్లుగా తయారుచేసి విక్రయించడానికి సిద్ధమైన ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా కూడా గజ్వేల్, రాయపోల్ మండలాలకు చెందినవారే. గంజాయి సేవించడం, మత్తులో మరికొందరిని ముంచడమే ఈ గ్యాంగ్ పని.

10 గ్రాములకు రూ.500పైనే

కిలోల కొద్దీ గంజాయి నిల్వలు పట్టుబడుతున్నప్పటికీ విక్రయించడం మాత్రం 10గ్రాముల చొప్పునే అన్నట్లుగా తెలుస్తున్నది. ఒక ప్యాకెట్‌ను రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. ఒక్కోసారి రూ.వెయ్యి దాకా కూడా పలుకుతుందని అంటున్నారు. 10 గ్రాముల ప్యాకెట్‌తో 4 సిగరెట్ల నిండా గంజాయిని నింపవచ్చని చెబుతున్నారు. సిగరెట్‌లో ఉన్న పొగాకును తొలగించి ఆ స్థానంలో గంజాయి పెడుతున్నారు. ఈ లెక్కన ఒక సిగరెట్‌కు రూ.150పైగానే వెచ్చిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సాధారణంగా ఒక పొగాకు సిగరెట్ ఖర్చు రూ.10 నుంచి రూ.20 వరకు ఉంటుంది. కానీ గంజాయి సిగరెట్ విలువ అంతకు పదిరెట్లపైనే ఉండడం గమనార్హం. మత్తులో బానిసలుగా మారడమే గాకుండా ఆర్థికంగానూ తీవ్రంగా నష్టపోతున్నారు. పేద వాళ్లు, కార్మికుల సంగతి పక్కనబెడితే రిసార్టులు, ఫామ్ హౌజ్‌లు, క్లబ్బుల్లో కూడా గంజాయి వినియోగం సాగుతుందని వినికిడి.



సిద్దిపేట పట్టణంలో విక్రయించడానికి తీసుకెళ్తున్న 4 కిలోల గంజాయిని, నిందితులను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

డ్రగ్స్ రహిత జిల్లా సాధ్యమేనా?

డాక్టర్ అనురాధ సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో పలు విషయాలపై చర్చించారు. సిద్దిపేటను డ్రగ్స్ రహిత పోలీస్ కమిషనరేట్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఆమె చెప్పినట్లుగానే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రధానంగా గంజాయి విక్రయాలపై పటిష్ట నిఘాను ఏర్పాటు చేశారు. ఆమె రాకకు ముందు కూడా గంజాయి విక్రయాలు ఉన్నప్పటికీ వెలుగులోకి రాలేదు. కానీ ఆమె దృష్టి పెట్టిన తర్వాత నిత్యం ఎక్కడో ఒక చోట గంజాయి నిల్వలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీనిని నియంత్రిస్తున్నా నిషాకు అలవాటుపడినవారు మాత్రం వదలడం లేదు. డ్రగ్స్ ప్రభావం లేకున్నప్పటికీ గంజాయి మాత్రం విచ్చలవిడిగా విస్తరిస్తున్నది. గంజాయి విక్రయాలను కూకటివేళ్లతో పెకిలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. గంజాయి విక్రయాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పలుమార్లు సీపీ చెప్పుకొచ్చారు. సమాచారం చేరిన వెంటనే చర్యలకు ఉపక్రమించడంలో సీపీ అనురాధ తనదైన ముద్ర వేస్తున్నారు.



సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- సిద్దిపేట బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహణ

సిద్దిపేట క్రైం, మార్చి 31: పదవ తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం కోసం జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో మూల్యాంకన కేంద్రాన్ని నిర్వహించనున్నారు. ఈ కేంద్రంలో తొమ్మిది జిల్లాల జవాబు పత్రాలను మూల్యాంకం చేయనున్నారు. మార్చి 30న పదవ తరగతి ప్రధాన పరీక్షలు పూర్తి కాగా, ఏప్రిల్ 2న వృత్తి విద్యా కోర్సుల పరీక్షలు పూర్తి కానున్నాయి. ఇప్పటి వరకు జిల్లా మూల్యాంకన కేంద్రానికి 1.20 వేల జవాబు పత్రాలు చేరాయి. మిగిలినవి ఏప్రిల్ 3వరకు చేరనున్నాయి. ఏప్రిల్ 3నుంచి 11వ వరకు కొనసాగనున్నది.

విధుల్లో 830 మంది ఉపాధ్యాయులు

836 మంది ఉపాధ్యాయులతో జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు. వీరిలో 76 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 600 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 160మంది స్పెషల్ అసిస్టెంట్ ఎగ్జామినర్స్ ఉన్నారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడుగురు సహాయ క్యాంప్ అధికారులు ఒక్కో సబ్జెక్టును పర్యవేక్షించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సీసీ కెమెరాలు నిఘాలో మూల్యాంకనం కొనసాగనుంది. మూల్యాంకన కేంద్రం బయట పోలీసుల ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉపాధి కూలీలకు గుడ్‌న్యూస్..

- రూ.28 పెరిగి రూ.300కు చేరిన దినసరి కూలి
- నేటి నుంచే అమలులోకి
- జిల్లాలో 2.37లక్షల మంది కూలీలకు ప్రయోజనం

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 31: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న వారికి ఏటా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే ఏప్రిల్ ఒకటవ తేదీన దినసరి కూలి రేటును పెంచుతుంది. దానిలో భాగంగా ఈసారి వారం రోజుల క్రితమే కూలీ పెంచుతున్నట్లు ప్రకటన వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 2.37 లక్షల మంది కూలీలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.272 చెల్లిస్తుండగా ఇప్పుడు రూ.28 పెంచడంతో దినసరి కూలీ రూ.300కు చేరింది. 2005లో ఉపాధి హామీ పథకం ప్రారంభమైనప్పుడు కేవలం రూ.87.50 మాత్రమే చెల్లించేవారు. ఏటా పెంచుతూ 19 ఏళ్ల తర్వాత రూ.300కు చేరింది. జిల్లాలో 499గ్రామపంచాయతీలు ఉండగా అందులో ముంపు గ్రామాలు పోగా 489 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 1,36,000 జాబ్ కార్డులు ఉండగా అందులో 2.37లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. ఈ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 42లక్షల పని దినాలను అధికారులు గ్రామసభల్లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

వేసవి భత్యాన్ని పునరుద్ధరించాలి


ఏటా వేసవి కాలంలోనే ఉపాధి హామీ కూలీలకు పనులు అధికంగా లభిస్తుంటాయి. అయితే గతంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దినసరి కూలీతో పాటు వేసవి భత్యం చెల్లించేవారు. దీంతో 15 నుంచి 30 శాతం వరకు అధికంగా డబ్బులు అందేవి. రెండేళ్లుగా దీనిని తొలగించారు. పలుగు, పార భత్యాలు కూడా వారానికి ఒకసారి చెల్లించేవారు. దానిని కూడా ఆపివేశారు. ఆయా భత్యాలను పునరుద్ధరించాలని కూలీలు కోరుతున్నారు.

ప్రతీ కూలీకి పని కల్పించేలా చర్యలు



జిల్లాలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపడుతున్నాం. ప్రతీ ఒక్క కూలీకి పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. పెరిగిన దినసరి కూలి రూ.28 కలుపుకుని రూ.300 కూలీకి అందుతాయి. నేటి నుంచే ఇది అమలులోకి రానుంది. ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో సాధ్యమైనంత వరకు ఉదయం పూటను తమ పనులు చేసుకోవాలి.

- జయదేవ్ ఆర్యా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి



భక్తులతో కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

కొమురవెల్లిలో భక్తజన సందడి

చేర్యాల, మార్చి 31: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా 11వ వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పదో తరగతి పరీక్షలు ముగియడంతో పాటు వచ్చే ఆదివారంతో జాతర ముగియనుండటంతో పొరుగు జిల్లాలకు చెందిన సుమారు 50 వేలమంది రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారి దర్శనానికి సుమారు 5గంటల సమయం పట్టడంతో ఇబ్బందులుపడ్డారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టగా, సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు. పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మల్లన్నను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన గడ్డం దేవయ్య ఆదివారం రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. ఆలయ ఈవో బాలాజీశర్మ అతడికి స్వామి వారి ప్రసాదం, రశీదును అందించారు.



పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


ఫాంహౌజ్ నుంచి జిల్లాల పర్యటనకు..

- ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరిన మాజీ సీఎం కేసీఆర్

జగదేవ్‌పూర్, మార్చి 31: రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం ఉదయం మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి బస్సులో బయలుదేరి వెళ్లారు. ఉదయం 9:30 గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన కేసీఆర్‌కు అయన బాల్య మిత్రుడు జహంగీర్ చేతికి దట్టీ కట్టారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తిలకం దిద్ది సాగనంపారు. ఆయన వెంట జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి సంతోష్‌కుమార్, మధుసూదన్‌చారి, కర్నె ప్రభాకర్ వెళ్లారు. పర్యటన అనంతరం రాత్రి తిరిగి ఫాంహౌస్‌కు చేరుకున్నారు.



ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి జిల్లాల పర్యటనకు బస్సులో బయలుదేరి వెళ్తున్న కేసీఆర్



వ్యాపారులతో మక్క రైతుకు నష్టం

రైతుల అవసరాలే ఆసరాగా దోపిడీ

- బహిరంగ మార్కెట్‌లో మక్కలకు డిమాండ్
- తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- తరుగు, ఇతర కారణాలతో తూకంలో కోతలు

హుస్నాబాద్ రూరల్, మార్చి 31: హుస్నాబాద్ డివిజన్‌లో మక్కల కొనుగోలుపై వ్యాపారులు అందిన కాడికి దండుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో మక్కలకు డిమాండ్ ఉన్నా, వివిధ కారణాలు చెప్పి ధరలను తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు మక్కలకు రూ.2,300-2400 వరకు ధర ఉండగా వ్యాపారులు రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని తమ ఇష్టానుసారంగా ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. వరి ధాన్యం లాగానే మక్కల కొనుగోలులోనూ తరుగు తీస్తున్నారు. వెంటనే డబ్బులు ఇవ్వాలని కోరితే వందకు రెండు రూపాయల చొప్పున కట్ చేస్తున్నారు. మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడంతో సంతృప్తి చెందిన రైతులకు వ్యాపారులు మాత్రం ధర విషయంలో న్యాయం చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు.

12,179 ఎకరాల్లో మక్క సాగు

ఈ యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను గ్రహించిన మెట్ల ప్రాంత రైతులు గతంలో కంటే ఈ ఏడాది మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర ఉండటంతో రైతులు ఈ ఏడాది వరి తగ్గించి మొక్కజొన్న సాగు చేశారు. హుస్నాబాద్ డివిజన్‌లోని కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో 12,179 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. యాసంగి సీజన్‌లో ముందస్తుగా మొక్కజొన్న సాగు చేసిన రైతుల పంట కోతకు రావడం, మార్కెట్‌లో మద్దతు ధర రూ.2,300 పలకడంతో ధాన్యం అమ్ముకున్న రైతులు సంతృప్తి చెందారు. కానీ వారం రోజులుగా మక్కజొన్న కోతలకు రావడంతో రైతుల అవసరాలను గ్రహించిన వ్యాపారులు రూ.200 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. అందులోనూ తూకంలో మోసాలు, తరుగు తదితర కారణాలతో క్వింటాలుకు 2కిలోలు కోత విధిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.2,100 నుంచి రూ.2,150 వరకు ధర నిర్ణయించి, కొంటున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. డబ్బులు కూడా వారం, పదిహేను రోజుల వాయిదా పద్ధతిలో చెల్లిస్తున్నారు. నగదు ఇవ్వాలని కోరిన రైతులకు రూ.100కు రూ.2 రూపాయలు కట్ చేసుకుని, నగదును అందజేస్తున్నారు. దీంతో రైతులు మరింత నష్టపోతున్నారు.

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్మకానికి తెస్తే దళారుల బెడదతో మాకు కష్టాలు తప్పడం లేదు. బహిరంగ మార్కెట్‌లో మక్కలకు మంచి ధర ఉన్నా వ్యాపారులు మాత్రం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. మక్కలకు కనీసం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,500 పెంచితేనే రైతుకు లాభం జరుగుతుంది. రైతుల అవసరాలను గ్రహించిన వ్యాపారులు తరుగు, నాణ్యత పేరిట తూకంలో కోతలు విధిస్తూ మోసం చేస్తున్నారు. వ్యాపారులపై చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి.

- పొన్నం రవి, రైతు, మహ్మదాపూర్



పంటలకు నీరందించి మానవత్వం చాటుకోవాలి

● ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట, మార్చి 31: కోతకు వచ్చిన పంటలను కాపాడేందుకు చెరువు నుంచి నీళ్లు విడుదల చేసేందుకు శాలిపేట గ్రామస్థులు సహకరించి మానవత్వం చాటుకోవాలని ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. చిన్నశంకరంపేట మండలంలోని శాలిపేట నల్లచెరువు నుంచి నీళ్లను విడుదల చేసేందుకు చెన్నాయిపల్లి గ్రామ రైతులు కోరడంతో శాలిపేట గ్రామవాసులు నిరాకరించారు. దీంతో సంబంధిత అధికారులు గ్రామస్థులను సమన్వయం చేసి నీళ్లను విడుదల చేసేందుకు కృషిచేసినా ఫలితం దక్కలేదు. దీంతో అధికారులు వెనుదిరిగిన సంఘటన విధితమే. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలోని సీఐ వెంకటేష్, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్, ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణగౌడ్, ఇరు గ్రామాల పెద్దలను సమన్వయ పరిచేందుకు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరి కోత దశకు రావడంతో ఎండిపోతున్నాయని చెన్నాయిపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, నల్ల చెరువు నుంచి రెండు, మూడురోజులు నీళ్లను విడుదల చేసి పంట పొలాలను పారిస్తే పంట చేతికొస్తుందని అన్నారు. ఇరు గ్రామాల రైతులు అర్థం చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో శాలిపేట గ్రామ ప్రజలు విముఖత చూపినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఆర్ఐ గోవింద్, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు, ఇరుగ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వైభవంగా సీతారాముల కల్యాణం

తొగుట, మార్చి 31: మండల కేంద్రమైన తొగుటలో సీతారామాంజనేయస్వామి ఆలయ పంచదశ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ పరిసరాలు రామనామస్మరణతో దద్దరిల్లాయి. ఉదయం పుణ్యహవాచనం, గణపతి పూజ, ఆంజనేయస్వామికి అభిషేకం, నవగ్రహస్థాపన పూజ తదితర కార్యక్రవలు జరిగాయి. ఈ కల్యాణం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిజీ, అఖిల భారత హన్‌మాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీల పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వారు భక్తులకు ఉపదేశమిచ్చారు. సీతారాముల కల్యాణానికి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సాధనతోనే సంగీత పరిజ్ఞానం

● ప్రముఖ బాలీవుడ్ నేపథ్య గాయని అనన్యభాస్కర్

పటాన్‌చెరు, మార్చి 31: క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధనతోనే సంగీత పరిజ్ఞానం లభిస్తుందని ప్రముఖ బాలీవుడ్ నేపథ్య గాయని అనన్యభాస్కర్ అన్నారు. ప్రముఖ సంగీత శిక్షణ సంస్థ మ్యూజికల్ అకాడమీ హైదరాబాద్‌లోని 8వ బ్రాంచ్‌ను బీరంగూడలో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచి స్వర జ్ఞానం, సంగీత వాయిద్యాలపై శిక్షణ అందించాలన్నారు. సంగీత స్వర జ్ఞానాన్ని పెంపొందించడంలో మ్యూజికల్ అకాడమీ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, మ్యూజిగల్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్.లక్ష్మీనారాయణ మాట్లాడారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి. - గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడే యడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

రూ.3.82కోట్ల పన్నుల వసూలు

● మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య

గజ్వేల్, మార్చి 31: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో గతేడాదికి మించి ఆస్తి పన్నులను వసూలు చేశామని మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సరస్వతి శిశుమందిర్‌కు చెందిన రూ.4లక్షల 75వేల 878, బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చెందిన రూ.10లక్షల 46వేల 644 పన్నును వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నులకు సంబంధించి రూ.3.06 కోట్లు వసూలు చేస్తే, ఈ సంవత్సరం రూ.3.82కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించారు.



గజ్వేల్ పట్టణంలో ఆస్తి పన్నును కమిషనర్‌కు చెల్లిస్తున్న యజమానులు

గోదావరి జలాలను విడుదల చేయాలి

● కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మార్చి 31: మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి పంటల సాగుకోసం కూడవెళ్లి వాగులోకి గోదావరి జలాలను విడుదల చేయాలని కోరుతూ, ఆదివారం కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దాంతో వారు సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయండి

సిద్దిపేట టౌన్, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డికి తెలియజేశానన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ గెలిస్తే పార్టీ పూర్వ వైభవానికి కృషి చేసిన వారమవుతామని తెలిపారు. ఈ మేరకు సిద్దిపేటలో గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం ప్రారంభించినట్లు, నియోజకవర్గంలో ఏదైనా సమస్యలు ఉంటే నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వచ్చి కలిసేలా ఏర్పాట్లు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అంతేకాకుండా సిద్దిపేట అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమితో పూర్తిగా కనుమరుగవుతుందని తెలిపారు. అందుకు నాయకులు కార్యకర్తలు కలిసి సమష్టిగా పనిచేద్దామని సూచించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న హరికృష్ణ

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

వర్గల్, మార్చి 31: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి తిరు కల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాశాఖ తరుపున ఆలయ కార్యనిర్వహణాధికారిణి అన్నపూర్ణ ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయం ముందు కల్యాణ మండపంపై సర్వాంగా సుందరంగా అలంకరింపజేసిన వేదికపై దేవతా మూర్తులను అధిష్ఠింపజేసి వేద పండితుల మంత్రోశ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్యన కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించడానికై జిల్లాలోని పరిసర ప్రాంతాల భక్తులతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కూచారం నర్సింలుగౌడ్ పాల్గొన్నారు. స్వామివారిని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముత్యాలు, పల్లెల రవీందర్ ఉన్నారు.

బస్సులోంచి దూకి గాయాలపాలైన వ్యక్తి మృతి

చేర్యాల, మార్చి 31: తన గమ్యస్థానం దాటిపోయిందన్న ఆత్రుతలో ఆర్టీసీ బస్సులోంచి కిందకు దూకిన వ్యక్తి శనివారం రాత్రి మృతిచెందాడు. చేర్యాల పట్టణానికి చెందిన సూర్ల కనకయ్య(60) జగదేవ్‌పూర్ మండలానికి చెందిన తమ బంధువుల ఇంటికి వెళ్లిన కనకయ్య పట్టణ శివారులోని ఆర్టీసీ బస్టాండ్‌లో దిగాడు. అనంతరం జనగామకు వెళ్లే బస్సు ఎక్కాడు. పాత బస్టాండ్ సమీపంలో దిగాల్సి ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్ ఏరియా దాటిపోవడాన్ని గమనించి ఆత్రుతతో కిందకు దూకాడు. దీంతో గాయాలవడంతో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చేర్యాల పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో మల్లన్న భక్తులకు గాయాలు

చేర్యాల,మార్చి 31: కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ఇంటికి వెళ్తుండగా ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డుప్రమాదాలలో పలువురు భక్తులు గాయాలపాలయ్యారు. హైదరాబాదులోని ముషీరాబాద్‌కు చెందిన కొందరు ఆదివారం కొమురవెల్లికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరిగివేళ్లే క్రమంలో ఆటోలు లభించకపోవడంతో ఆలయ సమీపం నుంచి రాజీవ్ రహదారి వరకు నడుచుకుంటూ వెళుతుండగా, గౌరాయపల్లి గ్రామశివారు సమీపంలో వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో సుమాంజలి, దక్షాయని, వరుణ్, వరుణ్య, అనూషలు గాయాలపాలయ్యారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారిని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ తలారి శివాజీని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. అలాగే సిద్దిపేట మండలం నాంచారుపల్లి గ్రామానికి చెందిన జిడ్డి రమేశ్ బైక్‌పై కొమురవెల్లికి వచ్చి దర్శనం చేసుకుని తిరిగి వెళ్తుండగా, గ్రామశివారులోని వాటర్‌ప్లాంటు సమీపంలో గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి తండ్రి ముత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ నాగరాజు తెలిపారు.

చాంద్‌ఖాన్ మక్తాలో కోటి తలంబ్రాల దీక్ష

● రామభక్తిని చాటుకున్నగ్రామస్థులు

వర్గల్, మార్చి 31: వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్తా గ్రామంలో శ్రీ రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కోటీ తలంబ్రాల దీక్ష కార్యాక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు నేతృత్వంలో గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు రెండు గంటల పాటు రామనామస్మరణ చేశారు. అనంతరం గోటితో వడ్లను ఒలిచి భద్రచలం రాముల వారి కల్యాణానికి తలంబ్రాలను తయారు చేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణం కోసం వడ్లను వలిచే తలంబ్రాలు తయారు చేసి పంపిండం ఎంతో పుణ్యఫలమని, అంతటి భాగ్యం కొందరికే దక్కుతుందన్నారు. గోటితో ఒలిచిన తలంబ్రాలే భద్రాచలం సీతారాముల కల్యాణానికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. అనంతరం రామరాజును గ్రామానికి చెందిన నాయకులు, గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో షైలారం ఎంపీటీసీ మేదిన సజనిత భిక్షపతిరెడ్డి, తాజీ మాజీ సర్పంచ్ కనకయ్య, పీఏసీఎస్ డైరక్టర్ పద్మారెడ్డి, గ్రామస్థులు నారషైన బాబు, కృష్ణ, సత్తయ్య, అశోక్, లావణ్య, వార్డు మెంబర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కోటీ తలంబ్రాల దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు

దేశ ప్రజల అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం

● బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

ములుగు/కుకునూరుపల్లి/గజ్వేల్/జగదేవ్‌పూర్ మార్చి 31: దేశ ప్రజల అభివృద్ధి ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, తనపై పోటీ చేయడానికి మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి సిద్దిపేట జిల్లాలో దోచుకున్న దొంగ వెంకట్రామారెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మన్నె శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్య, మాజీ సర్పంచ్ సురేశ్‌గౌడ్, పార్టీ మర్కుక్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, కొండు నర్సింహులు, శ్రీకాంత్, శ్రీనివాస్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు. మాజీ సీఎం డబ్బులకు వెంకట్రామారెడ్డికి మెదక్ సీటును అమ్ముకున్నాడని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడారు. కార్యక్రమానికి ముందు మండలాధ్యక్షుడి ఫొటో ఫ్లెక్సీల్లో లేదని రెండు గ్రూపుల మధ్య నెలకొన్నది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బైరి శంకర్ గురువారెడ్డి, శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి పలు గ్రామాల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సూట్‌కేసులు పట్టుకొచ్చినోళ్లకు టికెట్లు ఇచ్చాయని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మండల, పట్టణ కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. హరీష్‌రావు దగ్గర అడుక్కునేవాడు కావాలో ప్రజల పక్షాన పోరాడే నాయకుడు కావాలో మెదక్ ప్రజలే నిర్ణయించుకోవాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడారు.



బీజేపీ ములుగు మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం

దూళిమిట్ట, మార్చి 31: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఏపీఎం బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ-గ్రేడ్ ధాన్యం ధర రూ.2203, బి-గ్రేడ్ ధాన్యం ధర రూ.2183 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వీవో లక్ష్మి, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో

దౌల్తాబాద్, మార్చి 31: నేడు దౌల్తాబాద్‌లోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో వెంకటలక్ష్మి, తహసీల్దార్ సుజాత ప్రారంభించనున్నట్లు ఐకేపీ ఏపీఎం కిషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తెలిపారు.

కల్యాణలక్ష్మి కోసం ఎదురుచూపులు

● మంజూరు చేయాలని దరఖాస్తుదారుల వేడుకోలు

దౌల్తాబాద్, మార్చి 31: పేదింటి ఆడ పిల్లల కోసం ప్రభుత్వం అందించే కల్యాణ కానుక కోసం దౌల్తాబాద్ మండలంలోని లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులున్నప్పటికీ, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకపోవడం, ప్రజా ప్రతినిధులు సకాలంలో ఆమోదించకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన ఆడ పిల్లలకు పెళ్లి కానుకగా ప్రభుత్వం రూ.100,116 నగదును అందజేస్తున్న విషయం తెలిసిందే. దౌల్తాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 2023 అగస్టు నుంచి ఈ సంవత్సరంలో కొత్తగా వివాహం చేసుకున్న జంటలు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కొంతమంది తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారలు చొరవ చూపి పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను త్వరగా అందజేయాలని కోరుతున్నారు.

8 నెలలుగా ఎదురుచూపే



మా చెల్లి వివాహం జరిగి 10 నెలలు అవుతున్నది. కల్యాణ లక్ష్మి కోసం గత సంవత్సరం అగస్టు నెలలో దరఖాస్తు చేశాను. ఇప్పటికి 8 నెలలు గడుస్తున్నా కల్యాణ లక్ష్మి సాయం అందలేదు. ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు కల్యాణ లక్ష్మి సాయం త్వరగా అందజేయాలని కోరుతున్నాం.

- పొడిశెట్టి వినయ్, సూరంపల్లి, దౌల్తాబాద్

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని రైతుల నిరసన

● అడ్డుకున్న పోలీసులు

బెజ్జంకి, మార్చి 31: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయాలని రాజీవ్ రహదారిపై ఆదివారం నిరసనకు యత్నించిన రైతులను పోలీసులు అడ్డుకున్నారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల శివారులో 557, 559, 561 సర్వే నెంబర్లలో నిర్మంచతలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం రోజు రోజుకు వివాదం అవుతున్నది. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని గుగ్గిల్ల, తిమ్మాయిపల్లి, కోహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన రైతులు రాజీవ్ రహదారిపై నిరసన తెలిపేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న బెజ్జంకి పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, శాంతి, భద్రతలకు ఆటంకం కలిగించవద్దని సూచించారు. ఫ్యాక్టరీ నిర్మాణం పట్ల అభ్యంతరాలు ఉంటే లీగల్‌గా వెళ్లాలని పోలీసులు వారికి వివరించి నిరసన విరమింపజేశారు. నిరసన విరమించిన అనంతరం రైతుల పట్ల ఎస్ఐ కృష్ణారెడ్డి దురుసుగా ప్రవర్తించి భూతులు తిట్టాడని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. దీనిపై ఎస్ఐ కృష్ణారెడ్డిని వివరణ కోరగా రైతులతో శాంతియుతంగా మాట్లాడి నచ్చచెప్పామని, వారి పట్ల దురుసుగా పరవర్తించలేదని పేర్కొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

కల్లాల నిర్మాణంపై కమ్ముకున్న నీలినీడలు



రోడ్డుపైన ఆరబోసిన ధాన్యం (ఫైల్)

మద్దూరు, మార్చి 31: రైతుల కల్లాల నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. మద్దూరు ఉమ్మడి మండలంలో సుమారు 22 వేల మంది రైతులున్నారు. మండలంలో పోయిన ఏడాది 17,830 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈ సారి 18,760 ఎకరాల్లో సాగు చేసినట్లు మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో ప్రభుత్వ పథకాలను రైతులకు అందించడంలో ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పంట కోతల అనంతరం కిరాయికి పరదాలు తెచ్చుకుని కొంత మంది రైతులు పొలాల్లో, మరికొంత మంది రైతులు రోడ్లపైనే కల్లాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఒక్కో పంట కల్లం నిర్మాణానికి ఉపాధిహామీలో రూ.45 వేలు ఖర్చు చేస్తుండగా, చాలా మంది రైతులు అధికారుల ఆదేశాల మేరకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో గ్రామపంచాయతీ సెక్రటరీల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అయినా జిల్లా కార్యాలయం నుంచి మంజూరుకు నోచుకోలేదు. కేవలం 20 మంది రైతుల కల్లాలకు మాత్రమే మోక్షం లభించినట్లు తెలుస్తున్నది. ఈజీఎస్ యాక్ట్ ప్రకారం ఉపాధిహామీలో కల్లాల నిర్మాణాలు లేవంటూ 2021-22లో నిలిపివేసినట్లు ఉపాధిహామీ అధికారులు చెబుతుండటంతో, రైతుల ప్రయోజనాలు అటకెక్కినట్టేనన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతున్నది. చిన్నాసన్నకారు రైతుల కల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని మండల రైతాంగం కోరుతున్నది.

ఎకరాకు రూ.30లక్షల నష్టపరిహారం ఇవ్వాలి

● ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 31: ట్రిబుల్ ఆర్ భూనిర్వాసితులకు ఎకరాకు రూ.30లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ట్రిబుల్‌ఆర్‌కు భూసేకరణ చేపడుతున్న నేపథ్యంలో, ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారంతో పాటుగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో 250 చదరపు గజాల ప్లాట్‌ను కేటాయించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల నుంచి రూ.6లక్షల నుంచి రూ.18లక్షల వరకు ఆయా భూసేకరణలో నష్టపరిహారాన్ని అందజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా నష్టపరిహారాన్ని అందజేయాలని, పోలీసులను పెట్టి బెదిరింపులకు గురిచేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తాను గతంలో మల్లన్నసాగర్ భూనిర్వాసితుల గురించి పోరాటం చేశానని, మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు నష్టపరిహారం, ప్యాకేజీ, 250 గజాలలో ఇళ్లను కేటాయింపజేసే పోరాటంలో తాను ఉన్నానని గుర్తు చేశారు. ఆయనవెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల చందు, మాజీ జడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విరాసత్ అలీ, తలకొక్కుల దుర్గాప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిచారి, అహ్మద్ తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక

రాయపోల్, మార్చి 31: రాయపోల్ మండలం వడ్డెపల్లిలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీలను మండల పార్టీ అధ్యక్షుడు రాజాగౌడ్ సమక్షంలో నియమించారు. వడ్డెపల్లి, వీరారెడ్డిపల్లి, దొడ్లపల్లి గ్రామాలకు చెందిన బూత్ కమిటీల అధ్యక్షులుగా నుచ్చు కరుణాకర్, గంగిరెడ్డి రవి, బంటు మహేశ్, రామకృష్ణను ఎన్నుకున్నారు.

ఘనంగా ఈస్టర్

చేర్యాల, మార్చి 31: ఈస్టర్ వేడుకలను చేర్యాల, కొమురవెల్లి మండలాల క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక షాలేం మందిరంలో జరిగిన వేడుకలలో బ్రదర్ అందె విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

మల్లన్నస్వామి జాతరకు విరాళం

మర్కుక్, మార్చి 31: మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న మల్లన్నస్వామి ఉత్సవాల్లో ఆదివారం ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రంలు పాల్గొని రూ.10,000 విరాళం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, ఉత్సవాల నిర్వాహకులు కొమురయ్య, మల్లయ్య, కనకసేన తదితరులు ఉన్నారు.

జయప్రకాష్‌కు అయ్యప్ప సేవారత్న అవార్డు

సంగారెడ్డి రూరల్, మార్చి 31: సంగారెడ్డి పట్టణానికి చెందిన గురుస్వామి జయప్రకాష్‌కు అయ్యప్ప సేవారత్న అవార్డు వరించింది. హైదరాబాద్‌లో తెలంగాణ ఐక్యవైదిక ప్రతినిధులు ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్ధనంద శంకర భారతిస్వామి చేతులమీదుగా గురుస్వామి జయప్రకాష్‌కు అవార్డును ప్రదానం చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఎన్నిక

సంగారెడ్డి రూరల్, మార్చి 31: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ 6వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజేష్, కార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షులుగా వాణి, శ్రీనివాస్, నేహారెడ్డి, సహాయ కార్యదర్శులుగా పవన్, హరీశ్, సాక్షి, కమిటీ సభ్యులుగా విష్ణు, ప్రశాంత్, వైశాలి, రవి, కిరణ్‌గౌడ్, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, స్వప్న, విక్టోరియాలను ఎన్నుకున్నారు.

గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు

● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 31: గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రత్యేక క్యాంపులో భాగంగా నాలుగో రోజు ఆదివారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి, గ్రామంలోని వీధులను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతీ ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

మర్కుక్, మార్చి 31: గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెన్‌రాగ్ పండరి విజయం సాధించినందకు ఆయన స్వగ్రామమైన ఎర్రవల్లిలో తాజా మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి, ఎంపీటీసీ ధనలక్ష్మీ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గజ్వేల్ బార్ అసోసియేషన్‌కు తమ గ్రామం నుంచి ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, చిన్నారెడ్డి, రాంమోహన్‌రెడ్డి, కొమురయ్య, శివ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ మొదటి వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్

గజ్వేల్, మార్చి 31: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వరాలయ ప్రథమ వార్షికోత్సవ్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే ఆలయంలో గణపతిపూజ, స్వస్తివాచనవం, వరుణమండల ఆరాధనం, దేవతాహ్వానం, సీతారామచంద్రస్వామి పురుష సూక్త అభిషేకం, ఉమామహేశ్వర స్వామివార్లకు రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు నేతి చిన్న శ్రీనివాస్, బాల్‌కుమార్, తూం శ్రీధర్, పూజారులు దేశపతి రాజశేఖరశర్మ, శివకుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ 6వ తరగతికి విద్యార్థి ఎంపిక

వర్గల్, మార్చి 31: వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి తునికిఖాల్సా మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థి కొండగల్ల నిశాంత్ ఎంపికయ్యాడు. నవోదయకు ఎంపికైన నిశాంత్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్, ఉపాధ్యాయులు నాగరాజు, పులిరాజు, మంజులారెడ్డి, విమల, శిరీష, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.



నిశాంత్

గజ్వేల్‌లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లు, నగదు, పేకముక్కలు

గజ్వేల్, మార్చి 31: గజ్వేల్ పట్టణంలోని ఓ ఇంటిపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించి, రూ.28వేల 860, పది ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ పట్టణంలోని చంద్రశేఖర్ ఇంట్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పదిమందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.28వేల 860, పది ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా పేకాట, జూదం చట్టరీత్యా నేరమని, పేకాట ఆడితే 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారం అందించాలని, వివరాలను తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యకు రూ.58 లక్షల నిధులు

కొండపాక, మార్చి 31: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ విద్య నిర్వహణకు 2023-24 విద్యా సంవత్సరంలో ఖర్చు చేయడం కోసం స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి నిధులు మంజూరయ్యాయి. వీటిని ఆయా పాఠశాలల ఖాతాలలో జమ చేశారు. మార్చి చివరిరోజు లోపల డ్రా చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. ఒకరోజు ముందు బ్యాంకులో జమచేసి చివరిరోజు తీసుకోవాలని చెప్పడం విశేషం. సిద్దిపేట జిల్లాలోని 106 స్కూళ్లలో ప్రీ ప్రైమరీ విద్యను నిర్వహిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం సుమారు రూ.58 లక్షలను విడుదల చేసి.. ఆయా పాఠశాలల ఖాతాలో జమచేసింది. ప్రతి పాఠశాలకు రూ.50 వేల చొప్పున అంటే.. రూ.53 లక్షలు, 1113 విద్యార్థులు ప్రీ ప్రైమరీలో ఉన్నారు. ప్రతి విద్యార్థికి 500 చొప్పున మొత్తం రూ.5.56 లక్షలు జమయ్యాయి. ఒకరోజే ఉండడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆగమేఘాలపై బ్యాంకుల్లో డ్రా చేయడానికి వెళ్లారు. ప్రీ ప్రైమరీ విద్య చదువుతున్న విద్యార్థుల కోసం కేటాయించిన నిధులను పాఠశాల అభివృద్ధిలో భాగంగా ఫర్నిచర్, ప్లే మెటీరియల్, మ్యాట్స్, కార్పెట్స్, గ్రీన్ చాక్ బోర్డ్, స్టోరీ బుక్స్, స్వింగ్ చైర్స్‌లకు వినియోగించాలి. అలాగే రూ.500లలో విద్యార్థులకు ఉపయోగపడే వివిధ రకాల చార్టులు, స్టేషనరీ ఐటమ్, నోట్ బుక్స్‌ల కోసం వినియోగించాలి. ఇదిలా ఉండగా వారంరోజుల క్రితమే బడుల నిర్వహణ కోసం రెండో విడత డబ్బులు పాఠశాలల ఖాతాలలో జమయ్యాయి. విద్యా సంవత్సరం చివరలో విడుదల చేయడం కంటే ముందుగా ఇస్తే బాగుండేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

రాంసాగర్‌లో గుప్తనిధుల కోసం తవ్వకాలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాయపోల్, మార్చి 31: సులువుగా డబ్బు సంపాదించాలని అత్యాశ పడిన పలువురు వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపి జైలు పాలయ్యారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ రఘుపతి వివరాల ప్రకారం.. గజ్వేల్‌లో నివాసముంటున్న నరేందర్ బట్టల వ్యాపారం చేస్తున్నాడు. అతనికి గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లికి చెందిన సుంచు పోచయ్య, రాంసాగర్‌కు చెందిన ఎరుకల కిష్టయ్యలతో పరిచయం ఏర్పడింది. కిష్టయ్యకు వేటకు వెళ్లే అలవాటు ఉన్నది. వేటకు వెళ్లిన క్రమంలో రాంసాగర్ శివారులోని పెద్దగుట్ట సమీపంలో ఒకచోట రాళ్లు క్రమ పద్ధతిలో పేర్చి ఉండడం గమనించాడు. అక్కడ తవ్వితే ఏదైనా దొరుకుతుందని భావించాడు. ఈ విషయం పోచయ్య నరేందర్‌కు చెప్పాడు. వీరితో పాటు రాంసాగర్‌కు చెందిన ఎరుకల రామచంద్రం, వస్కుల మహంకాళి, స్వామిలను తీసుకొని రాళ్లున్న ప్రదేశంలో కొన్నిరోజులుగా తవ్వకాలు జరపసాగారు. ఇది గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.